క్లుప్తంగా

డ్రాఫ్ట్ బడ్జెట్ ఆమోదం పొందేదెప్పుడు?

యానాం: పుదుచ్చేరికి ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గత నెల 18న ఎల్జీ రాధాకృష్ణన్ అధ్యక్షతన రూ.12,700 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదించినా డ్రాఫ్ట్ బడ్జెట్‌కు కేంద్రం ఇప్పటికీ ఆమోదించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందని ఏఐఏడీఎంకే రాష్ట్ర కార్యదర్శి అన్బళగన్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న డ్రాఫ్ట్ బడ్జెట్ ప్రతిపాదనల ఫైలు ఆమోదం పొందేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక కార్యదర్శి న్యూఢిల్లీ వెళ్లాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌కు ఆమోదం తెలపకపోతే సంక్షేమ పథకాలు అమలు చేయడం అసాధ్యమన్నారు.

దీపావళి షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: యానాం, పుదుచ్చేరిల్లో తాత్కాలిక దీపావళి షాపుల ఏర్పాటుకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పుదుచ్చేరి కలెక్టర్ కులోంగుత్తున్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుదుచ్చేరి పెటయాన్ చత్రం, వెలుహొత్తూర్ రోడ్డులోని కలెక్టర్ కార్యాలయంలో ఆగస్టు 14వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తుకు అభ్యర్థులు రెండు ఫొటోలు, షాప్ మ్యాప్, రూట్ మ్యాప్, పరిసర ప్రాంతాల వివరాలు తెలియజేయాలన్నారు. అదేవిధంగా ల్యాండ్ డీడ్, రెంట్ డీడ్, నో అబ్జక్షన్ సర్టిఫికెట్, విద్యుత్, నీటిపన్ను రసీదులు జత చేయాలన్నారు.

యువకుల రక్తదానం



రాజమహేంద్రవరంలో రక్తదానం చేస్తున్న స్వామి వివేకానంద యోగాశ్రమ యువకులు

అమలాపురం టౌన్: బ్లడ్ క్యాన్సర్, హృద్రోగం రోగులతో పాటు రక్త హీనతతో బాధపడుతున్న గర్భిణులకు స్థానిక స్వామి వివేకానంద యోగాశ్రమానికి చెందిన 10 మంది యువకులు రక్తదానం చేసి ఆపదలో ఆదుకున్నారు. యోగాశ్రమానికి చెందిన పి.దుర్గ, ఎం.సతీష్, ఎస్.పవన్, జి.దుర్గారావు, పి.కార్తీక్, ఎస్.చంటి, పి.శ్రీను, కె.నాగు, కె.సాత్విక్, పి.ఫణీంద్రలు రక్త దానం చేశారని యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. అమలాపురం నుంచి రాజమహేంద్రవరానికి వెళ్లి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు రక్తదానం చేయడంపై ఆయా ఆస్పత్రుల వైద్యులు, రోగుల బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

తపో ఆశ్రమ అభివృద్ధికి కృషి చేస్తా

ముమ్మిడివరం: భగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తన సహాయ సహకారాలు అందిస్తానని అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ మాధూర్ పేర్కొన్నారు. శనివారం బాలయోగీశ్వరుల తపో ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. పెద్ద బాల యోగీశ్వరులు, చిన బాలయోగీశ్వరుల దివ్య సమాధులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమ ప్రాంతానికి వెళ్లే రహదారి ఆధునీకరణకు నిధులు కేటాయించాలని ఆశ్రమ కమిటీ సభ్యులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, జగడం సత్యనారాయణ, దొమ్మేటి రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజికవేత్త చల్లా వర్ధంతి

యానాం: రైతులకు శాస్త్రీయ సేద్యం గురించి అవగాహన కల్పించి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేసిన రైతు సంఘ నాయకుడు చల్లా వెంకట్రావు వర్ధంతిని ఆదివారం ఆలమూరులో నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మూఢ నమ్మకాలపై నేడు అవగాహన సదస్సు

అమలాపురం టౌన్: మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సైన్స్ ఆధారిత సమాజ నిర్మాణంలో విద్యార్థులను భాగస్వాములను చేసేందుకు ఆదివారం స్థానిక ప్రకాశం వీధిలోని యూటీఎఫ్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.శంకర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎంటీవీ సుబ్బారావులు ఈ మేరకు శనివారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. సదస్సుకు జిల్లాలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి మద్యం అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను శనివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు సుంకరపాలెం ఎస్ఈబీ ఎస్ఐ ఎం.రామస్వామి తెలిపారు. రావులపాలేనికి చెందిన జి.దుర్గాసాయి, పశ్చిమగోదావరి జిల్లా పెనుమర్తికి చెందిన కె.రవికుమార్, పెదపూడి రామేశ్వరానికి చెందిన కె.చిన్నిలు సుమారు 13 లీటర్ల మద్యాన్ని తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశామని చెప్పారు.

నాటి అభివృద్ధి ఫలితం.. ముంపునకు మోక్షం

- ఐ.పోలవరం మండలంలో ముంపునకు అడ్డుకట్ట
- వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి
- శిథిల స్లూయిజ్‌ల స్థానంలో కొత్తవి నిర్మాణం



పాత ఇంజరం అవుట్ ఫాల్ స్లూయిజ్ వద్ద షట్టర్లు బిగిస్తున్న సిబ్బంది (ఫైల్)

ఐ.పోలవరం: ఐలెండ్ (ఐ.పోలవరం)లో తరతరాలుగా రైతులు, సామాన్యుల దుఃఖానికి కారణమవుతున్న ముంపు సమస్యకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మోక్షం కల్పించింది. గోదావరి వరదలు, భారీ వర్షాల సమయంలో గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలతో పాటు వందల ఎకరాల్లో వరిచేల ముంపునకు కారణమవుతున్న శిథిల అవుట్ ఫాల్ స్లూయిజ్‌ల స్థానంలో కొత్తవాటిని నిర్మించారు. దీని వల్ల ముంపు సమస్యకు పరిష్కారం లభించింది. ప్రస్తుతం గోదావరికి వరద పోటెత్తడం, మరోవైపు భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో అవుట్ ఫాల్స్ నిర్మాణాలను రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

వరద ముంచెత్తేది

ఐ.పోలవరం మండలం చుట్టూ గౌతమీ, వృద్ధ గౌతమీ నదులు ప్రవహిస్తుంటాయి. మండలంలోని వరి చేల ముంపునీరు, వర్షాల నీరు ప్రధాన డ్రెయిన్ల నుంచి నదీపాయల్లో కలుస్తుంది. మండలంలో 14 అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు ఉన్నాయి. వీటిలో నార్త్ అడ్డాల్, కేశనకుర్రులో లింగాల తూము, నల్లంకి తూము, ఎత్తు పల్లాల తూము, గొల్లల తూము, లింగన్న తూము, పెరమళ్లరాజు తూము తదితర డ్రెయిన్లు ఉన్నాయి. వీటిలో మండల పరిధిలో ఆరు వరకూ అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు శిథిల స్థితికి చేరుకుని అధ్వానంగా ఉండేవి. వీటి ద్వారా ముంపు నీరు దిగేది కాదు. ఇదే సమయంలో వరద నీరు వీటి నుంచి డ్రెయిన్ల ద్వారా ఎగదన్ని పొలాలను, గ్రామాలను ముంచెత్తేది. పాత ఇంజరం, గుత్తెనదీవి, జి.మూలపొలం, కేశనకుర్రు, కేశనకుర్రుపాలెంలో సుమారు 7 వేల ఎకరాలు ముంపుబారిన పడేవి. ఆయా గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల కాలనీలను వరద ముంచెత్తేది. వరద ఉన్నన్ని రోజులు ముంపునీరు దిగే అవకాశం లేక చేలు కుళ్లిపోయేవి. ముంపునకు భయపడి రైతులు తొలి పంట సాగు చేయకుండా వదిలేసే వారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రజా సమస్యలను గుర్తించి శిథిలమైన స్లూయిజ్‌లను ఆధునీకరించారు. నార్త్ అడ్డాల్ కాలువను రూ.40 లక్షలు, నల్లంకి తూము రూ.10 లక్షలు, పాత ఇంజనీరం అవుట్ ఫాల్ స్లూయిజ్‌ను రూ.12 లక్షలతో పునర్నిర్మాణం చేశారు. అప్పటి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు కేటాయించారు. మిగిలిన స్లూయిజ్‌ల వద్ద దెబ్బ తిన్న తలుపులను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేశారు. నాడు చేసిన అభివృద్ధి ఫలితం నేడు స్పష్టంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఒకవైపు గోదావరి వరద ఉధృతి పెరుగుతున్నా, మరోవైపు భారీ వర్షాలు కురుస్తున్నా చేలల్లో పెద్దగా ముంపు లేకుండా పోవడానికి ఇదే కారణమని రైతులు చర్చించుకుంటున్నారు. అవుట్ ఫాల్ స్లూయిజ్‌లను మరమ్మతులు చేసి గ్రామాలకు సైతం ముంపు నుంచి రక్షణ కల్పించారని స్థానికులు చెబుతున్నారు.

స్లూయిజ్‌ల వల్ల రక్షణ కవచం



మండలంలో ఎన్నో ఏళ్లగా వరదల సమయంలో స్లూయిజ్‌ల వల్ల చాలా ఇబ్బంది పడేవాళ్లం. వరద నీరు పంట పొలాల్లోకి, లోతట్టు ప్రాంతాలను ముంచెత్తేది. గత ప్రభుత్వ చొరవతో మండలంలో ప్రధాన స్లూయిజ్‌లు మరమ్మతులు చేయడం, కొన్ని కొత్తవి నిర్మించడంతో మండలానికి రక్షణ కవచం ఏర్పాటు చేసినట్టైంది. పెద్ద వరదలు వస్తే తప్ప ముంపునకు గురయ్యే అవకాశం లేదు.

– పిన్నంరాజు వెంకటపతిరాజు, కేశనకుర్రుపాలెం

అందరూ ఉన్న అనాథ ఆమె

- నెలలుగా రోడ్డు పక్కనే కాలం వెళ్లదీస్తున్న వృద్ధ యాచకురాలు
- ఆమెపై ఓ ఉపాధ్యాయిని మానవత్వం
- వృద్ధాశ్రమంలో చేర్పించే యత్నంలో తెలిసిన చేదు నిజం




ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి వృద్ధ యాచకురాలితో మాట్లాడుతున్న ఉపాధ్యాయిని సుజాత

అమలాపురం టౌన్: ఆమె వయసు 90 ఏళ్ల పైబడి ఉంటుంది. పట్టణంలోని సర్క్యులర్ బజార్ సమీపంలోని ఓ బ్యాంక్ ఏటీఎం వద్ద రోడ్డు పక్కనే జీవనం సాగిస్తుందా వృద్ధ యాచకురాలు. అనాథగా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ గత నాలుగైదు నెలలుగా అక్కడే కాలం వెళ్లదీస్తుందామె.. ఆమెను చూసి స్థానిక వెత్సావారి అగ్రహారంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జీవీఎస్ సుజాత చలించిపోయింది. గత కొంత కాలంగా సదరు వృద్ధురాలి తిండి, బట్ట అవసరాలు తీరుస్తూ వచ్చింది. అయితే అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వృద్ధురాలిని ఏదైనా వృద్ధాశ్రమంలో లేదా అనాథ శరణాలయంలో చేర్పించాలనుకుంది. నేరుగా కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కలిసి వృద్ధురాలి దీనస్థితిని వివరించి సాయం కోరింది. దీంతో కలెక్టర్ ఐసీడీసీ అధికారుల బృందాన్ని వృద్ధురాలి వద్దకు పంపించారు. ఆమెను వృద్ధాశ్రమానికి తరలించే ప్రయత్నం చేయగా తాను అనాథను కాదని, తనకు ఇద్దరు కొడుకులున్నారని బదులివ్వడంతో అంతా అవాక్కయ్యారు. తనది అమలాపురమేనని, కుటుంబసభ్యులు తనను బయటకు నెట్టేయడంతో ఇలా రోడ్డుపై ఉంటున్నానని కన్నీరుమున్నీరైంది. దీంతో ఆమె కుటుంబీకులను కలిసి మాట్లాడే ప్రయత్నంలో ఐసీడీఎస్ సిబ్బంది పడ్డారు. కుటుంబీకులు ఆమెను తిరిగి అక్కున చేర్చుకునేందుకు అంగీకరిస్తే వారికి అప్పగిస్తామని, లేదంటే ఏదైనా వృద్ధాశ్రమంలో చేర్పిస్తామని చెబుతున్నారు. ఆమెకు సరైన గూడు కల్పించాలన్న ఉపాధ్యాయిని సుజాత ప్రయత్నం ఫలించాలని సర్క్యులర్ బజార్ ప్రాంత వ్యాపారులు, ప్రజలు కోరుకుంటున్నారు.

పోటెత్తుతున్న గోదావరి



మురమళ్లలో నీట మునిగిన వరి నారుమడులు



ఐ.పోలవరం మండలంలో పెరుగుతున్న గోదావరి

ఐ.పోలవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి క్రమేపీ పెరుగుతుంది. దీంతో ఐ.పోలవరం మండలంలోని వృద్ధ గౌతమీ నదీ వెంబడి ఉన్న గోదావరి పోటెత్తుతుండడంతో లంక ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. మురమళ్ల, పశువుల్లంక, కొమరగిరి, ఎదుర్లంక, గుత్తినదీవి, జి.మూలపొలం, కేశనకుర్రు గ్రామాల చుట్టూ వరద నీరు రోజురోజుకూ పెరుగుతుంది. వరద ఉధృతి పెరిగితే ఆక్వా చెరువుల రైతులు నష్టాలను చూడాల్సి వస్తుందని భయపడుతున్నారు.

నీట మునిగిన వరి పొలాలు

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలుచోట్ల నారుమడులు నీట మునిగాయి. మురమళ్ల, ఐ.పోలవరం, కేశనకుర్రు, గుత్తినదీవి, పాతయింజరం తదితర గ్రామాల్లో పల్లపు పొలాలు నీట మునిగాయి. డ్రైన్లు వేగంగా నీటిని లాగకపోవడంతో వరి పొలాల్లో నీరు నిలిచి పోయి చెరువులను తలపిస్తుంది. అధిక వర్షాలకు రోడ్లు, లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. నీట మునిగిన వరి పొలాల నుంచి నీరు బయటకు తోడేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ముంపు బారిన పడిన నారుమడులు దెబ్బతినడం వల్ల దాళ్వా సాగుకు తీవ్ర ఆటంకం కలుగుతుందని రైతులు వాపోతున్నారు.

ఎస్పీ కృష్ణారావును కలిసిన వ్యాపారులు



ఎస్పీ కృష్ణారావును సత్కరిస్తున్న వ్యాపార సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణంలో రాత్రి 11 గంటల వరకూ దుకాణాలు తెరుచుకునే అవకాశం కల్పించాలని కోరుతూ స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ బొడ్డేపల్లి కృష్ణారావును ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన వ్యాపార సంఘాల ప్రతినిధులు శనివారం కలిసి వినతి పత్రం అందించారు. ఇటీవలే జిల్లాకు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కృష్ణారావును చాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున వ్యాపార ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఎస్పీని కలిసిన వారిలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, కార్యదర్శి కొమ్మూరి వెంకటప్రసాద్, ముఖ్య సలహాదారు నల్లా పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు మోకా వెంకట సుబ్బారావు, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, వలవల శివరావు, రాయుడు నాని తదితరులున్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



అమలాపురం ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న డ్వామా పీడీ మధుసూదన్

అమలాపురం రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మండల పరిధిలోని 22 గ్రామాల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ జరిగింది. మొత్తంగా 1157 పనులకు గాను వేతనాల కింద రూ.5,94,44,760 చెల్లించగా, మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.1,84,524 నిధులు ఖర్చు చేశారు. మొత్తం రూ.5.96 కోట్లతో చేపట్టిన పనులపై గ్రామాల వారీగా సామాజిక తనిఖీని పీడీ మధుసూదన్ నిర్వహించారు. వీటితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ విభాగాల్లో జరిగిన పనులపై సైతం తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో డీపీఓ భీమేశ్వరరావు, అసిస్టెంట్ డీపీఓ సత్యనారాయణ, అంబుడ్స్‌మెన్ అడపా వెంకట శ్రీనివాసరావు, ఎస్ఆర్పీ కనకారావు, ఎంపీడీవో జి.మల్లికార్జునరావు, ఏపీవో ఎ.శివకుమారి, ఆర్.సునీత, కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గట్టును పరిశీలించిన కలెక్టర్

సాక్షి కథనానికి స్పందన



కుండలేశ్వరంలో రక్షణ గట్టును పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

కాట్రేనికోన: గౌతమీ గోదావరి వెంబడి మురమళ్ల నుంచి బలుసుతిప్ప వెళ్లే ఏటిగట్టు కుండలేశ్వరం వద్ద ఏటిగట్టు బలహీనం కావడంపై శనివారం 'సాక్షి' దినపత్రికలో కుంగుతున్న రక్షణ గట్టు శీర్షికన ప్రచురితమైంది. దీనిపై కలెక్టరు ఆర్.మహేష్ కుమార్ స్పందించి కుండలేశ్వరం వద్ద బీటలు వారుతున్న ఏటిగట్టును శనివారం పరిశీలించారు. అక్కడ గ్రావెల్ వేసి తక్షణమే రక్షణ పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గట్టు బలహీనంగా ఉన్న చోట శాశ్వత నిర్మాణ పనుల్లో భాగంగా రివిట్‌మెంట్ వాల్ నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెడ్ వర్క్స్ డివిజనల్ ఇంజినీర్ కేవీవీ సుబ్బారావు, జూనియర్ ఇంజినీర్ ఈశ్వర్ మన్యం తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు స్కూల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: మండలంలోని గోడి బాలుర గురుకులంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ విద్యార్థులకు స్కూల్ కిట్లను శనివారం పంపిణీ చేశారు. సర్పంచ్ తోట శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగులు, షూలు, బెల్ట్‌లు, యూనిఫాం అందజేశారు. గురుకులంలో సాధారణ ఖర్చులకు నిధులు మంజూరు చేయాలని, సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఎమ్మెల్యే ఆనందరావుని కోరారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో కొత్త సంస్కరణలు చేశారని, కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ఎంపీటీసీ కాంద్రేగుల వాణి, ఎంఈఓ కిరణ్‌బాబు, ఏడుకొండలు, ప్రిన్సిపాల్ కిరణ్మయి, డి.సత్తిబాబురాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు విద్యార్థులకు విద్యా సామగ్రిని శనివారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, మండల విద్యాశాఖ అధికారులు కె.కిరణ్‌బాబు, ఎస్.సత్యకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు నాగులపల్లి శేషవేణి తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై నిర్లక్ష్యం వద్దు

అంబాజీపేట: డయేరియాపై నిర్లక్ష్యంగా ఉండకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. నందంపూడి శివారు అమ్మవారితోటలో డయేరియా పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో జ్వరాలు, డయేరియా సోకే అవకాశాలు ఉన్నందున కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. బయట వంటకాలకు స్వస్తి చెప్పి ఇంటిలో వండిన వాటినే వేడి వేడిగా తినాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

ఐఐటీ ఖరగ్‌పూర్‌కు ఎంపిక



ఆకాష్

యానాం: నియోజకవర్గ పరిధిలోని మెట్టకూరులో జవహర్ నవోదయ విద్యాలయలో విద్యనభ్యసించిన విద్యార్థి యు.ఆకాష్ ఐఐటీ ఖరగ్‌పూర్‌కు ఎంపికైనట్లు వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకాష్ 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని పొందడమే కాక అనంతరం రెండేళ్లు బెంగుళూరులోని నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో దక్షిణా ఫౌండేషన్‌లో విద్యనభ్యసించినట్లు తెలిపారు. ఆకాష్ నవోదయలో చదివి ఐఐటీకి ఎంపిక కావడం తమ విద్యాలయానికి గర్వకారణమన్నారు. ఆకాష్‌ను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల బృందాన్ని, తల్లిదండ్రులను ఆయన అభినందించారు. ఆకాష్ తండ్రి యు.జయప్రకాష్ స్థానిక నవోదయ విద్యాలయలో గణిత ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఆకాశ్ సోదరి ఏంజెల్ సీబీఎస్ఈ–2024 ఫలితాల్లో అఖిల భారత స్థాయిలో నాలుగో స్థానంలో నిలవడం విశేషం.

కిడ్నీ బాధితుడికి రూ.30 వేల సాయం

పి.గన్నవరం: ఎల్.గన్నవరంలోని డొక్కా సీతమ్మ కాలనీకి చెందిన కొల్లు రవీంద్ర కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆ యువకుడికి మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాయకులు శనివారం రూ.30 వేల సాయం అందించారు. రవీంద్రకు ఇటీవల రెండు కిడ్నీలు పాడవడంతో వైద్యం చేయించుకునేందుకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఫెడరేషన్ నాయకులు ముందుకొచ్చి బాధితుడికి సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల యూటీఎఫ్ అధ్యక్షుడు దూనబోయిన రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి గిడ్ల శ్రీనివాసరావు, నాయకులు కె.రవికుమార్, జి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మ కమలాలు



వికసించిన బ్రహ్మ కమలాలు

ముమ్మిడివరం: మండలంలోని క్రాప గ్రామంలో బొబ్బిలి రుద్రయ్య నాయుడు పెరట్లో నాటిన బ్రహ్మకమలం మొక్కలకు శుక్రవారం రాత్రి కమలాలు వికసించాయి. ఏడాది క్రితం పెరట్లో నాటిన బ్రహ్మ కమలం మొక్కలకు ఎనిమిది పుష్పాలు వికసించి విశేషంగా ఆకర్షిస్తున్నాయి. పలువురు ఈ పుష్పాలను సందర్శించి ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

డ్రెయిన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి



ఉప్పలగుప్తం మండల సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జానకి

ఉప్పలగుప్తం: పొలాల్లో నీరు దిగక ముంపునకు గురై రైతులు నష్టపోతున్నారని, అధికారులు వెంటనే మీడియం, రెవెన్యూ డ్రెయిన్లపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆధునీకరించాలని పలువురు సభ్యులు కోరారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో కె.కిరణ్‌బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కొన్ని అభివృద్ధి పనులను చేపట్టామని, వాటిని ప్రస్తుత ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలని కోరారు. వ్యవసాయాధికారి కుమార్‌బాబు, పలువురు సభ్యులు మాట్లాడుతూ మండలంలో గొరగనమూడి, పాయకరావురావుకోడు డ్రెయిన్‌లు నీరు దిగక 650 ఎకరాల్లో వరి సాగు చేసిన రైతులు నష్టపోతున్నారన్నారు. అదే విధంగా కూనవరం మేజర్ డ్రెయిన్‌ను 4 కిలోమీటర్లు డ్రెడ్జింగ్ పనులు చేస్తే రైతులకు వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా సాగు చేస్తారన్నారు. సన్నవిల్లి సర్పంచ్ జంగమయ్య రెవెన్యూ డ్రెయిన్‌ల ఆధునీకరణ ఏ శాఖకు చెందుతుందో తెలియక రైతులు సతమతమవుతున్నారన్నారు. చల్లపల్లి పంచాయితీ పరిధిలో టూరిజం డెవలప్‌మెంట్‌కు సంబంధించి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు పీఆర్ ఏఈ వి.రాధాకృష్ణ తెలిపారు. ఉప్పలగుప్తం, సన్నవిల్లి, భీమనపల్లి, విలసవిల్లి ఎంపీటీసీ సభ్యులు గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వెంకటేశ్వరప్రసాద్, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, సర్పంచ్‌లు బద్రి బాబ్జి, జిన్నూరి వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి రామచంద్రరావు, పెయ్యల రాజ్‌కుమార్, చిక్కం పెదబాబు, వాకపల్లి ఈశ్వరి, ఎంపీటీసీ సభ్యులు కొంకి ఏడుకొండలు, సురేఖావాణి, వంగా గిరిజాకుమారి, కాట్రు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.